క్లుప్తంగా

వైద్య శిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ పుష్పాంజలి

గజపతినగరం: స్థానిక గ్రామసచివాలయం -1లో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 61 మందికి మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పుష్పాంజలి, వైద్య సిబ్బంది వివిధ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితం గా మందులు అందజేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

గద్దర్‌కు నివాళి



గద్దర్ సంస్మరణ సభలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి

శృంగవరపుకోట: ప్రజాగాయకుడు గద్దర్ వర్ధంతిని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.కేశవరావు మాట్లాడుతూ గద్దర్ చైతన్య ప్రేరకు నిగా ప్రజల హృదయాల్లో చిరస్మరణీయ స్థానం సంపా దించుకున్నారన్నారు. ప్రజా సమస్యలపై తన కలాన్ని, గళాన్ని ఆయుధంగా చేసుకుని పోరాటం సాగించి, తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించారన్నారు. పలువురు లెక్చరర్లు గద్దర్ జీవిత ఘట్టాలను, ఆయన ప్రజల కోసం చేసిన ఉద్యమాలను వివరించారు.

పాఠశాల భవన నిర్మాణం పరిశీలన



చినదుంగాడలో పాఠశాల భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ జగదీశ్వరరావు

వేపాడ: మండలంలోని చినదుంగాడ, కడకొండ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ జగదీశ్వరరావు మంగళవారం సందర్శించారు. చినదుంగాడలో నాడు-నేడులో భాగంగా నిర్మించిన పాఠశాల భవనాన్ని పరిశీలించారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో భవనానికి సున్నాలు వేయించాలని, త్వరగా భవనాన్ని ప్రారంభించేలా చూడాలని హెచ్‌ఎంకు సూచించారు. కడకొండ పాఠశాలలో మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించారు.

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం



సమావేశంలో సమస్యలు వివరిస్తున్న డాక్టర్ హారిక

శృంగవరపుకోట: అనారోగ్య సమస్యలతో ఆస్పత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎంపీపీ, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ సోమేశ్వరరావు వైద్య సిబ్బందిని కోరారు. కొట్టాం పీహెచ్‌సీలో డాక్టర్ జె.హారిక నేతృత్వంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కిల్తంపాలెం, బొడ్డవర పంచాయతీలకు ఆరుగురు ఆశ వర్కర్లు, పీహెచ్‌సీలో నైట్‌వాచ్‌మన్‌ను నియమించేందుకు, ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు, మహిళా ఉద్యోగులకు టాయిలెట్స్ నిర్మాణానికి మందుల నిల్వకు రూమ్, సేఫ్టీ పిట్ నిర్మాణం, కాంటింజెట్ వర్కర్లకు నెలకు రూ.3వేలు చెల్లించేందుకు ప్రతిపాదిస్తూ కమిటీ తీర్మానం చేసింది. వైస్ ఎంపీపీ సుధారాజు, కమిటీ సభ్యులు, వైద్యులు, సిబ్బంది హాజరయ్యారు.

దోమల నియంత్రణకు చర్యలు



శృంగవరపుకోట: పుణ్యగిరిలో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది

శృంగవరపుకోట: పట్టణంలోని పుణ్యగిరిలో దోమల నివారణకు కొట్టాం పీహెచ్‌సీ సిబ్బంది ఐఆర్‌ఎస్ ఏసీఎం-5 శాతం మందును మంగళవారం పిచికారీ చేశారు. జిల్లా ఏఎంఓ డి.వి.రమణ ఈ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల వల్ల చికున్‌గున్యా, మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా వంటి వ్యాధులు వాపిస్తాయని చెప్పారు. దోమతెరలు వాడాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రజలకు సూచించారు.

కొత్తవలస మండలంలో..

కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెం,దత్తి, దన్నానపేట గ్రామాల్లో ఆయా పంచాయతీల, వియ్యంపేట పీహెచ్‌సీ సిబ్బంది మంగళవారం దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. గ్రామాల్లో ముందుగా పారిశుద్ధ్య పనులు చేయించారు.

సాగులో సాంకేతికతను వాడుకోవాలి



జామి: జామిలో రైతులకు డ్రోన్ ద్వారా పురుగు మందుల పిచికారీపై అవగాహన కల్పిస్తున్న ఏఓ కిరణ్‌కుమార్

జామి: వ్యవసాయంలో రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని, ఆధునిక పద్ధతులు పాటించడం వల్ల మంచి దిగుబడులు సాధించవచ్చని ఏఓ కిరణ్ కుమార్ అన్నారు. జామిలో రైతులకు డ్రోన్ల ద్వారా పురుగు మందుల పిచికారీపై మంగళవారం క్షేత్ర స్థాయిలో ప్రత్యక్షం గా అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్ ద్వారా పంటకు పురుగు మందులు, ద్రవరూప ఎరువులను పిచికారీ చేసుకో వచ్చని చెప్పారు.ఎకరానికి 10 నుంచి15 నిముషాల వ్యవధిలోనే పిచికారీ చేయవచ్చని, సమయం ఆదా అవుతుందని తెలిపారు.సాగులో యంత్ర పరికాల వినియోగం ద్వారా కూలీల కొరతను అధిగమించవచ్చని, పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవచ్చని వివరించారు. వీఏఏలు అహ్మద్, అలేఖ్య, ఉష, మాజీ జెడ్పీటీసీ బండారు పెద బాబు, తదితరులు పాల్గొన్నారు.



గుర్ల: గుర్లలో వరి పైరులో కాలిబాటలు తీస్తున్న రైతులు

కాలిబాటలతో అనేక ప్రయోజనాలు

గుర్ల: వరి పైరులో కాలిబాటలు తీసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని గుర్ల వీఏఏ కృష్ణారావు రైతులకు సూచించారు. మండల కేంద్రం లో రైతులతో పంట పొలాల్లో మంగళవారం కాలిబాటలు తీయించారు. వరినాట్లు పూర్తయిన 15 రోజుల తర్వాత పొలంలో ప్రతి రెండు మీటర్ల దూరంలో 20 సెంటీమీటర్ల వెడల్పుతో కాలిబాటలు తీసుకోవాలని చెప్పారు. ఇలా చేయడం వల్ల మొక్కలకు గాలి, వెలుతురు బాగా తగిలి దుబ్బు లు పటిష్టంగా తయారై అధిక దిగుబడులు వస్తాయని, చీడపీడలు కూడా ఆశించవని తెలిపారు. ఎరువులు వేసుకునేందుకు వీలుగా ఉంటుందని వివ రించారు.



కొత్తపనసలు పాడు వద్ద కొండలను తాకుతున్న మేఘాలు

ప్రకృతి సోయగం



కొండలను తాకినట్టుగా కనిపిస్తున్న మబ్బులవరుస

కనుచూపు మేర పచ్చని కొండలు.. వాటిని తాకుతూ ముందుకు సాగే మబ్బులు... పచ్చని పంట పొలాలతో కూడిన ప్రకృతి సోయగం మంగళవారం సాయంత్రం చూపరులకు కనువిందు కలిగించింది. బొండపల్లి మండలం వెదురువాడ పంచాయతీ పరిధిలోని పనసలుపాడు, కొత్తపనసలుపాడు గ్రామాల మధ్య కనిపించిన ఈ సుందర దృశ్యాన్ని చూసిన ప్రకృతి ప్రేమికులు పులకించిపోయారు. కాసేపు వాటిని చూస్తూ ఆస్వాదించారు.

– బొండపల్లి

మాదకద్రవ్యాల జోలికి పోవద్దు



అవగాహన కల్పిస్తున్న ఎస్‌డీపీఓ గోవిందరావు

జామి: విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలకు బానిసగామారి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్‌డీపీఓ(సబ్ డివిజనల్ పోలీస్ అధికారి) ఆర్.గోవింద రావు సూచించారు. డ్రగ్స్ వినియో గం వల్ల కలిగే అనర్థాలతో పాటు చట్టాలపై భీమసింగిలోని బాలాజీ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల జోలికిపోతే భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. డ్రగ్స్, గంజాయి రవాణా చేయడం, వినియోగించడం నేరమని చెప్పారు. ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగిఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు, సైబర్, ఫోక్సో, తదితర చట్టాలను వివరించారు. ప్రతి ఒక్కరూ చట్టాలకు లోబడి నడుచుకోవాలన్నారు. చట్టాలను అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. జామి ఎస్‌ఐ వీరబాబు, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



కళాకారులకు అవగాహన కల్పిస్తున్న గోవిందరాజులు

చీపురుపల్లి: రంగులు పూసిన వినాయక విగ్రహాలతో పర్యావరణానికి హాని కలుగుతుందని, మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని మానవీయతా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బి.వి.గోవిందరాజులు అన్నారు. స్థాని క కుమ్మరికాలనీలో వినాయక విగ్రహాలు తయారు చేస్తున్న కళాకారులకు మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినాయక విగ్రహాలు వద్దు... మట్టి విగ్రహాలే ముద్దు అని, రంగులతో పూసిన విగ్రహాల వల్ల చెరువులు కలుషితమై మానవాళికి, జంతువులకు హాని కలుగుతుంద న్నారు. పర్యావరణ హితం మట్టి విగ్రహాలనే తయారు చేయాలని కోరారు.

విద్యాసామగ్రి వితరణ



కొట్యాడలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు అందజేస్తున్న శ్రీరామ ట్రస్టు అధ్యక్ష కార్యదర్శులు సుబ్బారావు, మధురవాణి

లక్కవరపుకోట: మండలంలోని శ్రీరాంపురం,రెల్లి గౌరమ్మపేట,కొట్యాడ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు శ్రీరాంపురం గ్రామానికి చెందిన శ్రీరామ చారిటబుల్ ట్రస్టు రూ.30 వేల విలువైన నోట్,కథలు, విజ్ఞాన సంబంధ పుస్తకాలు,పెన్నులు, తదితర విద్యాసామగ్రిని మంగళవారం అందజేశారు. ట్రస్టు అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ టి.సుబ్బారావు, వేదుల మధురవాణి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు తమవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. న్యాయవాది వేదుల సోమేశ్వరరావు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి



సర్వసభ్య సమావేశంలో సర్పంచ్ రామస్వామి, తదితరులు

కొత్తవలస: అధికారులు, పంచాయతీ పాలక మండలి సభ్యుల సహకారంతోనే పంచాయతీని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసుకోగలమని కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ రామస్వామి అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం లో పంచాయతీ సర్వసభ్యసమావేశం మంగళవారం నిర్వహించారు. పంచాయతీలో సులభ్ కాంప్లెక్స్, పాత దినప త్రికలు, కొబ్బరిచెట్ల ఫలసాయం వంటి వాటిని వేలంపాటలో దక్కించుకున్న వారికి కేటాయిస్తూ తీర్మానం చేశారు. రోజు వారీ మార్కెట్‌లో ఆశీల వసూళ్లకు సంబంధించి గతంలో రూ.6,77,000కు వేలం పాట పాడుకున్న వారికే కేటాయించాలని సభ్యులు కోరారు.పంచాయతీ పరిధిలో సమస్యలపై చర్చించారు. పంచాయతీ ఈఓ రత్నమాల,ఈఓపీఆర్డీ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వైద్యపరికరం వితరణ



రక్తపరీక్షల పరికరాన్ని అందజేస్తున్న దాతలు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రక్త పరీక్షలు నిర్వ హించుకునే పరికరాన్ని స్థానిక పారిశ్రామికవేత్త మజ్జి నాగేశ్వరరావు, ఉమామహేశ్వరి దంపతులు వితరణ చేశారు.దాతలకు వైద్యాధికారి రాజ్యలక్ష్మి, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ప్రతినిధి బోగాపురపు శ్రీదేవి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

సుప్రీం తీర్పు రాజ్యాంగ విరుద్ధం



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులుర్పిస్తున్న మాల మహానాడు నేతలు

వేపాడ: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని మాలమహానాడు మండల నాయ కుడు దేబార్కి కిరణ్ ఆరోపించారు. మండల కేంద్రంలో మాలమహానాడు నాయకులతో కలిసి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహా నికి మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ కులాల జాబితాను మార్చే అధికారం రాష్ట్రపతికే ఉందన్నారు.ఎస్సీ వర్గీకరణ అధికారం నేరుగా రాష్ట్రాలకే కట్టబెట్టినట్లు సుప్రీం తీర్పు ఉందన్నారు. రాష్ట్రంలో వర్గీకరణ చట్టం చేస్తామని సీఎం చంద్రబాబు అనడం విడ్డూరంగా ఉందన్నారు. దీన్ని తామంతా ఖండిస్తున్నామన్నారు. త్వరలో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. మాలమహానాడు నాయకులు అప్పారావు, గంగరాజు, ఆనంద్, నాగేష్, దేముడు, మధు, ప్రదీప్, వెంకన్న, శంకర్, బంగారయ్య, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శిక్షణ తరగతులు

మెరకముడిదాం: గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల వినియోగంపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఈనెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ ఎం.పావని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.మండల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులను మూడు బ్యాచ్‌లుగా చేసి మూడురోజుల పాటు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. శిక్షణకు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు విధిగా హాజరుకావాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గుర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ మంగళవారం తెలిపారు.ఎంపీపీ పొట్నూరు ప్రమీల అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండల అధికారులు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

భీమసింగి సుగర్స్ ఎండీగా సన్యాసినాయుడు



ఎండీగా ఉద్యోగ విరమణ చేసిన విక్టర్‌రాజును సన్మానిస్తున్న నూతన ఎండీ సన్యాసినాయుడు, తదితరులు

జామి: భీమసింగి విజయరామ గజపతి సుగర్ ఫ్యాక్టరీ ఎండీగా సన్యాసినాయుడు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. చోడవరం సుగర్ ఫ్యాక్టరీ ఎండీగా పనిచేస్తున్న ఈయన్ని ఇక్కడ ఎఫ్‌ఏసీ ఎండీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎండీకి కర్మాగార అధికార సిబ్బంది స్వాగతం పలికారు. ఇది వరకు ఎండీగా పని చేసి సోమవారం ఉద్యోగ విరమణ చేసిన విక్టర్‌రాజును నూతన ఎండీతో పాటు సిబ్బంది సన్మానించారు.


భవిత కేంద్రం సందర్శన



ప్రత్యేక అవసరాల పిల్లలకు అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 గంగరాజు

జామి: స్థానిక అంబేడ్కర్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని ఎంఈఓ-2 గంగరాజు మంగళవారం సందర్శించారు. ప్రత్యేక అవసరాల విద్యార్థులకు అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలతో పాటు వారికి పాఠాలు బోధిస్తున్న తీరును పరిశీలించి ఐఆర్టీలకు పలు సూచనలు చేశారు. కేంద్రంలో ప్రతీ మంగళ వారం అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలను ప్రత్యేక అవసరాల పిల్లలు సద్వినియోగం చేసుకునేలా తల్లి దండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.

విద్యార్థినులకు వైద్యపరీక్షలు



విద్యార్థినులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ ధరణి

వేపాడ: బక్కునాయుడుపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలోని 382 మంది విద్యార్థినులకు వేపాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ధరణి మంగళవారం వైద్య పరీక్షలు చేశారు.అవసరమైన వారికి మందులు అందజేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోపాటు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ ఆంజనేయులు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లక్ష్మి పాల్గొన్నారు.

తక్షణమే ఉపాధి వేతనాలు చెల్లించండి



ఎంపీడీఓ హరిహరరావుకు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

బొండపల్లి: ఉపాధి వేతనదారులకు ప్రభుత్వం తక్షణమే వేతనాలు చెల్లించాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు కోరారు. వ్యవ సాయ కార్మిక సంఘం నాయకులు, వేతనదారులతో కలిసి ఎంపీడీఓ ఎస్.హరిహరరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మే,జూన్ నెలల్లో చేసిన పను లకు సంబంధించి మండలంలో 4వేల మంది వేతనదారు లకు ఇంకా వేతనాలు అందలేదన్నారు.వేతనాలు విడుదల చేయకుండా ప్రభుత్వం మీనమేషాలు లెక్కపెడుతూ..ఆర్భాటాలకు మాత్రం పెద్ద ఎత్తున నిధులను ఖర్చు చేస్తోందని ఆరోపించారు.తక్షణమే వేతనాలు విడుదల చేయకుంటే ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు గోవింద రాంబాబు, రాము, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టీషర్టుల పంపిణీ



విద్యార్థులకు టీషర్టులు అందజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి, సాహసం సంస్థ చైర్మన్ గణేష్

లక్కవరపుకోట: చందులూరు గ్రామానికి చెందిన సాహసం స్వచ్ఛంద సంస్థ 'విజయ పథం' కార్యక్రమంలో భాగంగా స్థానిక ఉన్నత పాఠశాల, కేజీబీవీ,మోడల్ స్కూల్‌కు చెందిన 300 మంది విద్యార్థులకు మంగళవారం టీషర్టులు పంపిణీ చేశారు.కార్యక్రమానికి అతిథి గా ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హాజరయ్యారు. సాహ సం స్వచ్ఛంద సంస్థ చైర్మన్ మాచవరపు గణేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను గ్రూపులుగా విభజించి ఒక్కో గ్రూపునకు ఒక్కో రంగు టీషర్టు అందించామని తెలిపారు. వీరి కి వారాంతపు పరీక్షలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన గ్రూపు విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. ఎంఈఓ కూర్మారావు, హెచ్ ఎం వేణుగోపాల్, మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, జనసేనపార్టీ మండల అధ్యక్షుడు ఎస్.కె.ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు రోగనిరోధక శక్తి పెంపు



గుర్ల:గుర్లలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ సిబ్బంది



గంట్యాడ: వసాది అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహనకల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ పద్మ



దత్తిరాజేరు: పోరలిలో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

గంట్యాడ: బిడ్డకు తల్లిపాలు తాగించడం ద్వారా వారిలో రోగనిరోధక శక్తి పెరిగి వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యవంతంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్ వైజర్ పద్మ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా వసాది గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింత లకు తల్లిపాల ఆవశ్యకత, పౌష్టికాహారంపై మంగళ వారం అవగాహన కల్పించారు. సర్పంచ్ గొల్లు భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

గుర్ల: తల్లిపాలలో పోషకాలు అధికంగా ఉంటాయని, తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని గుర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి చిన్నయ్య, ఐసీడీఎస్ పీఓ అరుద్ర అన్నారు.తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. బిడ్డకు తల్లిపాలు తాగించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి, గ్రామాల్లో బాలింతలు, గర్భిణులకు అవగా హన కల్పించాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

దత్తిరాజేరు: గర్భిణులు విధిగా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పుట్టే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని పోరలి అంగన్‌వాడీ కేంద్రం-1 కార్యకర్త పద్మ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, తల్లిపాల ఆవశ్యకత మంగళవారం అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రం-2 కార్యకర్త లక్ష్మి, ఏఎన్‌ఎం శ్రీదేవి పాల్గొన్నారు.

రాత్రి పూట డ్యూటీలు చేయించడం తగదు



తహసీల్దార్ కృష్ణలతకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

జామి: సర్వీసు రూల్స్‌కు విరుద్ధంగా తమతో రాత్రి పూట తహసీల్దార్ కార్యాలయం వద్ద డ్యూటీలు చేయించడం తగదని, ఈ విధానాన్ని వెంటరు రద్దు చేయాలని కోరుతూ మండల వీఆర్‌ఏలు తహసీల్దార్ కృష్ణలతకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వీఆర్‌ఏలు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న అటెండర్స్,వాచ్‌మన్, రికార్డు అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని, అర్హులకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. తెలంగాణలో మాదిరిగా పేస్కేల్ అమలుచేయాలని డిమాండ్ చేశారు. వీఆర్‌ఏల సంఘం నేతలు ఆర్.అప్పలరాజు,అవతారం పాల్గొన్నారు.

దూరవిద్య కోర్సులపై అవగాహన కల్పించండి

కొత్తవలస: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (దూరవిద్యా విధానం) ద్వారా అందిస్తున్న టెన్త్, ఇంటర్మీడియట్ కోర్సులపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఎంఈఓ బి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎస్.రమణయ్య అధ్యక్షతన వెలుగు,విద్యాశాఖ సిబ్బంది ,పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లా డుతూ 14 ఏళ్లు నిండి రాయడం, చదవడం వచ్చే వారు ఓపెన్ టెన్త్‌కు, 15 ఏళ్లు నిండి ఇంటర్ ఫెయిల్ అయిన వారు, మధ్యలో చదువుమానేసిన వారు, పదోతరగతి పూర్తి చేసిన వారు ఓపెన్ ఇంటర్ చదివేందుకు అర్హులని చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ కోట అప్పారావు,ఈఓపీఆర్డీ ధర్మారావు పాల్గొన్నారు.